# ఆంతర్యాలు

సావిత్రమ్మ చాలా చిత్రమైన వ్యక్తి. ఆవిడ ఏ పనిచేసినా విడ్డూరమే! పదిమందీ చెప్పుకునేలా చేస్తుంది. అది ఆమెలోని ఓ ప్రత్యేకత!

రోజూ మధ్యాహ్నపూట చుట్టుప్రక్కల వున్న మహిళా బృందాన్నంతా చేరదీసి వాళ్ళతో పిచ్చాపాటీ కబుర్లు చెప్తూ వాళ్లకు కాఫీ ఫలహారాలు, డ్రింకులు, వగైరాలన్నీ యిస్తూ వాళ్ల మెప్పులు పొందడం సావిత్రమ్మకు హాబీ!

ఊర్లో క్రొత్త సినీమా వస్తే చాలు పనిమనిషితో సహా ఓ పదిమందిని వెంటేసుకు వెళ్తుంది. అలా వెళ్తేనేకాని ఆవిడకు సినీమా చూచినట్లుండదుట!

నెల పొడవునా ఎవరో చుట్టం ఇంట్లో మకాం వేస్తూనే వుంటారు.

సావిత్రమ్మ భర్త వేణుగోపాలం నయాన భయాన ఆమెను పలుమార్లు హెచ్చరించాడు.

"కొంచెం పొదుపు కూడిక నేర్చుకో! నెలకో పాతికరాళ్లు వెనకేస్తే ముందు ముందు పిల్లా పాప కలిగినా, ముసలికాలంలో, మనం ఒకళ్లపంచన చేరక్కర్లేకుండా గడపొచ్చు" అంటూ.

సావిత్రమ్మకు భర్త మాటలేం తలకెక్కవు. ఆవిడ ధోరణే ఆవిడది.

గట్టిగా ఏమైనా అంటే "ఆఁ! మీరు తెస్తున్న ముష్టి మూడొందలతో ఎలా గడుపుకొస్తున్నానో మీకేం తెల్సు ఈ గడ్డురోజుల్లో! ధరలన్నీ ఆకాశాన్ని అంటుకు పోతున్నాయి. ఒక్కనెల మీరు ఖర్చు పెట్టి చూడండి తెలుస్తుంది"

దాంతో వేణుగోపాలం నోరు బంద్!

"నీ ఖర్మ" అంటూ వూరుకుంటాడు. పైగా సావిత్రమ్మ వేణుగోపాలానికి మేనమామ కూతురు. చిన్నతనంలో తల్లీ తండ్రీ లేని వేణుగోపాలాన్ని చేరదీసి చదువు చెప్పించి ఓ

యింటివాడ్ని చేసిన మేనమామ కూతురు కనుక అట్టే ఘర్షణ పడలేక వూరుకుంటున్నాడు.

ఓరోజు సావిత్రమ్మ పినతండ్రి కూతురు పెళ్ళికి వెళ్లాల్సి వచ్చింది.

ప్రయాణానికంతా సిద్ధం చేసుకున్నారు. బయల్దేరేవేళకి "యిప్పుడే వస్తానని చెప్పి ప్రక్కవీధిలో వున్న ఇంజనీరుగారింటికి వెళ్ళి ఓ పదినిముషాల్లో చేతిలో చిన్న బాక్సుతో సహా తిరిగొచ్చింది సావిత్రమ్మ.

"అదేమిటి?" అన్నాడు వేణుగోపాలం ఆతృతగా.

సావిత్రమ్మ బాక్స్ తెరిచి చూపింది.

"డైమండ్ నెక్లెస్?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఆ బావుందా? మన ప్రక్క వీధిలో వున్న యింజనీరుగారావిడ మొన్ననే చేయించుకుంది. మూడు వేలైందట!" అంటూ నెక్లెస్ తీసి మెళ్లో వేసుకుంది.

"అంత ఖరీదు చేసే ఎరువు సొమ్ము..." నీళ్లు నమిలాడు వేణుగోపాలం.

"మరేం ఫర్వాలేదు బయల్దేరండి ట్రైన్ టైమైపోతోంది" అంటూ తొందర చేసింది.

పెళ్ళి పందిట్లో ఆడ, మొగ, అందర్ని ఆకర్షించింది సావిత్రమ్మ మెళ్లో వున్న వజ్రాలహారం!

"చాలా బావుందండీ! ఎక్కడ కొన్నారండీ? ఎంతైందండీ? తలొకరూ సావిత్రమ్మను పొగుడుతూ చుట్టూ మూగారు.

సావిత్రమ్మ గర్వంగా అందరికీ సమాధానం చెప్తూ మురిసిపోయింది.

తిరుగు ప్రయాణం రాత్రిపూట కావడంవల్ల సావిత్రమ్మ నెక్లెస్ తీసి బాక్స్‌లో పెట్టి దాన్ని భద్రంగా పెట్టెలో వుంచింది.

ఇంటికొచ్చాక మర్నాడుదయం వాళ్ల వస్తువు వాళ్లకిచ్చేద్దాం అని పెట్టి తీసి బాక్స్ తెరిచి కెవ్వుమని కేకేసి కూలిపోయింది.

"ఏం జరిగిందంటూ" వేణుగోపాలం ఆతృతగా వచ్చాడు.

సావిత్రమ్మకు నోటమాట రాలేదు. ఖాళీ బాక్స్ భర్తకు చూపించింది. వేణుగోపాలం అదిరిపడ్డాడు.

"నీకు అజాగ్రత్త జాస్తి! ఒకసారి బట్టలు అలా తీసి చూడు" అంటూ తనే స్వయంగా పెట్లో బట్టలన్నీ దులిపి చూసేడు.

నెక్లెస్ కనిపించలేదు.

"ఇప్పుడెలాగు! వాళ్లూరుకొంటారూ? నేను మొదటే చెప్పేను. నువ్వు వింటే కదా?" అంటూ కసురుకున్నాడు వేణుగోపాలం.

"మీరు ఆయనతో కొంచెం నెమ్మదిగా చెప్పండి. ఓ సంవత్సరంలో వాళ్ల వస్తువు వాళ్లకిచ్చేస్తామని. ఆయన మీ ఫ్రెండే కదా! ఈ లోపల సొమ్ము జతపరుద్దాం!" అంటూ ప్రాధేయపడింది. వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

"అంత డబ్బెక్కడి నుంచొస్తుందే? వచ్చే జీతం మన తిండికే చాల్డంలేదు..."

"అదంతా నేను చూసుకుంటాను. నావి నగలు కొన్ని వున్నాయి కదా మిగిలింది కూడబెడదాం. మీరు ఆయనకు కాస్త నచ్చచెప్పి వద్దురూ ప్లీజ్...." అంది.

వేణుగోపాలం కాదనలేకపోయాడు.

సావిత్రమ్మ ఆరోజు నుంచీ పూర్తిగా మారిపోయింది. మహిళా బృందం సావిత్రమ్మలో మార్పుకు కారణం అనేకవిధాల అన్వేషించి విఫలురయ్యారు. మునుపటి వలె కాఫీ ఫలహారాలు దొరకటంలేదు. కనుక వాళ్ళు తరుచు రావడం తగ్గించేసేరు.

"అదేమిటి పనిమనిషి రాలేదూ. అంట్ల గిన్నెలు తోముతున్నావు!" అన్నాడు వేణుగోపాలం ఆశ్చర్యంగా ఓ రోజు ఉదయం.

"లేదు నేనే మానిపించేసేను. ఈ రెండు గిన్నెలకోసం నెలకు పది రూపాయలకు పైగా ఖర్చవుతోంది" అంది సావిత్రమ్మ నవ్వుతూ.

వేణుగోపాలం మారు పలకలేదు.

"ఏవండీ! యిదుగో ఈ నెల్లో నూట అర్వై రూపాయలు మిగిలేయి. బ్యాంకులో వెయ్యండి. వచ్చేనెల్లో యింకొంచెం జాగ్రత్తగా గడుపుదాం" అన్న భార్య మాటలకు పొంగిపోయాడు వేణుగోపాలం.

"ఏమోయ్ వేణుగోపాలం! ఏమిటి వింతలు?" అంటూ ప్రశ్నించేరు ఇంజనీరుగారు ఓరోజు సాయంత్రం పార్కులో.

"ఏదో మీ దయవల్ల నెలకింత వెనకెయ్యగలుగుతున్నాం. మీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను...."

"చాలు చాలు ఆపవోయ్ దండకం" అంటూ నవ్వుతూ వెళ్ళిపోయేరు ఇంజనీరుగారు.

*'ప్రజారథం' 17-7-1970*